# కాంగ్రెస్‌తో స్కామ్‌లు.. బీఆర్‌ఎస్‌తో స్కీమ్‌లు

- మరోసారి ఆశీర్వదిస్తే నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేస్తా
- చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్


ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణపు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

చొప్పదండి, అక్టోబర్ 7: కాంగ్రెస్ పార్టీ అంటేనే స్కామ్‌లకు పెట్టింది పేరు అని.. బీఆర్‌ఎస్ అంటే స్కీమ్‌లకు నెలవని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. చొప్పదండి మున్సిపల్ పరిధిలోని 6వ వార్డులో శుక్రవారం రాత్రి రూ.40 లక్షల నిధులతో నూతన ఆరోగ్య ఉపకేంద్రం, బ్రాహ్మణకుంట శ్మశాన వాటిక నిర్మాణం, గాంధీనగర్ యాత్ బిల్డింగ్ మిగులు పనులు, తదితర అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మునుపెన్నడు లేని విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ సహకారంతో చొప్పదండి నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశానని గుర్తు చేశారు. పట్టణంలోని 6వ వార్డులో సుమారు రూ.5.70 కోట్ల నిధులు కేటాయించి అభివృద్ధి చేశానని వెల్లడించారు. పట్టణంలో ఇంకా సీసీరోడ్లు, డ్రైనేజీ నిర్మాణం కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపించానని, తప్పకుండా ప్రతి గల్లీగల్లీకి సీసీరోడ్లు, డ్రైనేజీ నిర్మాణం చేపడతామని పేర్కొన్నారు. ఆత్మ గౌరవం, అభివృద్ధి కోసం ఎన్నో పోరాటాలు, బలిదానాలు జరిగాయని, మళ్లీ కాంగ్రెస్ నాయకులు ఏ ముఖం పెట్టుకొని ఓట్ల కోసం వస్తున్నారని ప్రశ్నించారు. ఐదేళ్లలో ఒక్కనాడు కనిపించని ముఖాలు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మొసలి కన్నీళ్లు కారుస్తున్నాయని, అలాంటి నాయకులను నమ్మకూడదని ప్రజలకు సూచించారు. స్థానికుడినైనా తనను మరోసారి ఆశీర్వదించి, ఆదరించి గెలిపిస్తే ఇంకా నిధులు తెచ్చి, నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, వైస్ చైర్‌పర్సన్ ఇప్పనపల్లి విజయలక్ష్మి, మున్సిపల్ కౌన్సిల్ ఫోరం జిల్లా చైర్మన్, 6వ వార్డు కౌన్సిలర్ వడ్లూరి గంగరాజు, వైద్యాధికారి కట్ట రమాదేవి, మార్కెట్ వైస్ చైర్మన్ చీకట్ల రాజశేఖర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆరెల్లి చంద్రశేఖర్‌గౌడ్, వార్డు ప్రత్యేకాధికారి దీపక్, మాజీ ఎంపీటీసీ వడ్లూరి శోభన్ బాబు, ఆశ వర్కర్లు, వార్డు నాయకులుపాల్గొన్నారు.

# శిక్షణ పరిజ్ఞానంతో ఉజ్వల భవిష్యత్‌కు బాటలు

- హైదరాబాద్, హుజూరాబాద్ ఏడీఏలు సరళ, సునీత
- కేవీకేలో ముగిసిన అగ్రి డీలర్లకు శిక్షణ
- సర్టిఫికెట్ల ప్రదానం.. కొత్త బ్యాచ్ ప్రారంభం


శిక్షణ పొందిన డీలర్లకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న అధికారులు, తదితరులు

జమ్మికుంట, అక్టోబర్ 7: కృషి విజ్ఞాన కేంద్రంలో అందిస్తున్న శిక్షణ తరగతుల పరిజ్ఞానం ఉజ్వల భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తుందని హైదరాబాద్, హుజూరాబాద్ ఏడీఏలు సరళ, సునీత, వ్యవసాయ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, కేవీకే ప్రధాన కార్యదర్శి పరిపాటి విజయ్‌గోపాల్‌రెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త, హెడ్ డాక్టర్ వెంకటేశ్వర్‌రావు పేర్కొన్నారు. ఆత్మ, మేనేజ్ హైదరాబాద్ సహకారంతో జమ్మికుంట కేవీకే ఆధ్వర్యంలో దేశీ(డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్ ఫర్ ఇన్‌పుట్ బిజినెస్)కార్యక్రమంలో భాగంగా ఏడాది శిక్షణ పొందిన అగ్రిడీలర్లకు శనివారం వీడ్కోలు, కొత్త బ్యాచ్ ప్రారంభ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏడీఏ, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్, కేవీకే ప్రధాన కార్యదర్శి సీనియర్ శాస్త్రవేత్త, హెడ్, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. అగ్రి డీలర్లు వ్యవసాయంపై పరిజ్ఞానాన్ని పొందారని, దీనివల్ల సాగులో నూతన పద్ధతులు ఆవిష్కృతమవుతాయని పేర్కొన్నారు. శిక్షణ పొందిన డీలర్లు రైతులను చైతన్యవంతులను చేస్తారని పేర్కొన్నారు. క్షేత్రస్థాయి సందర్శనలు ఉపయోగపడతాయని చెప్పారు. ప్రతి రైతు సేంద్రియ వ్యవసాయం చేసేలా సలహాలు, సూచనలు అందించాలని చెప్పారు. కాలుష్య రహిత సాగు భవిష్యత్ తరాలకు ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. సాగులో మోతాదుకు మించి ఎరువులు వాడడాన్ని తగ్గించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. నేలను కాపాడుకుంటానే దిగుబడులు పెంచుకునే మార్గాలు వెతకాలన్నారు. శిక్షణ కార్యక్రమాలను ఎల్లవేళలా కేవీకే నిర్వహిస్తూనే ఉంటుందని, సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. శిక్షణ పొందిన ప్రతి డీలర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కొత్తగా శిక్షణకు వచ్చిన డీలర్లకు స్వాగతం పలికారు. అనంతరం శిక్షణ పొందిన డీలర్లు తమ అనుభవాలను పంచుకున్నారు. తర్వాత డీలర్లకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఇక్కడ దేశీ ఫెసిలిటేటర్ రామ్‌చందర్‌రావు, కేవీకే శాస్త్రవేత్తలు, శిక్షణ పొందిన 40మంది డీలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్‌ఆర్ శంకరన్ సేవలు చిరస్మరణీయం


ఎస్‌ఆర్ శంకరన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

తెలంగాణచౌక్, అక్టోబర్ 7: మాజీ ఐఏఎస్ అధికారి ఎస్‌ఆర్ శంకరన్ పేద ప్రజల అభ్యున్నతి కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని సీపీఐ జిల్లా ఉపాధ్యక్షుడు కొయ్యడ సృజన్ కుమార్ పేర్కొన్నారు. నగరంలోని పార్టీ కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవనంలో శనివారం ఎస్‌ఆర్ శంకరన్ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సృజన్‌కుమార్ మాట్లాడుతూ, ఉన్నత స్థాయిలో పదవులను నిర్వహించిన ఎస్‌ఆర్ శంకరన్ నిత్యం ఎస్సీ ఎస్టీ బీసీ వర్గాల అభ్యున్నతి కోసం ఆలోచించే వారని తెలిపారు. ఆయన జయంతి, వర్ధంతి వేడుకలను రాష్ట్రప్రభుత్వం అధికారంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి సురేందర్‌రెడ్డి, పైడిపల్లి రాజు, కిన్నెర మల్లమ్మ, అంజలి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి సర్పంచ్ పరామర్శ

శంకరపట్నం, అక్టోబర్ 7: మండలంలోని గద్దపాక గ్రామంలో గడ్డం కౌసల్య ఇటీవల మృతి చెందగా, శనివారం బాధిత కుటుంబాన్ని గ్రామ సర్పంచ్ గోపు విజయ్‌కుమార్ రెడ్డి పరామర్శించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, 50 కిలోల బియ్యం అందజేశారు. ఇక్కడ వార్డు మెంబర్ మాచర్ల వెంకటేశ్, మాజీ ఉప సర్పంచ్ రెడ్డి శ్రీనివాస్, గ్రామ పెద్ద అలివేలి సమ్మిరెడ్డి తదితరులున్నారు.

## రాయికల్‌లో పశువైద్య శిబిరం

సైదాపూర్, అక్టోబర్ 7: మండలంలోని రాయికల్ గ్రామంలో తెలంగాణ పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శనివారం పశువైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి డాక్టర్ విజేందర్‌రావు ఆధ్వర్యంలోని వైద్యబృందం 32 దూడలకు నట్టల నివారణ మందులు వేసింది. అలాగే పాడి పశువులకు గర్భకోశ వ్యాధులు, సాధారణ చికిత్స చేసింది. చూడి పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో గోపాలమిత్ర సూపర్‌వైజర్ రాంరెడ్డి, గోపాలమిత్రలు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, శరత్, శ్రీనివాస్ రైతులు పాల్గొన్నారు.

## గొర్రెల యూనిట్ల పంపిణీ

కరీంనగర్ రూరల్, అక్టోబర్ 7: కరీంనగర్ మండలంలోని చెర్లభూత్కూర్ గ్రామంలో శనివారం ఆరు గొర్రెల యూనిట్లను కరీంనగర్ మండల బొమ్మకల్ పశువైద్యాధికారి డాక్టర్ రామకృష్ణ, సర్పంచ్ దబ్బెట రమణారెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మరో రెండు రోజుల్లో మరో ఆరుగురు లబ్ధిదారులకు గొర్రెల యూనిట్లు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌తో పాటు ఎంపీటీసీ బుర్ర తిరుపతి గౌడ్, వైద్య సిబ్బంది సమ్మయ్య, గొర్రెల పెంపకందారుల సహకార సంఘం అధ్యక్షుడు చిట్కూరి సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

## బాల సదన్, శిశు గృహ తనిఖీ

కలెక్టరేట్, అక్టోబర్ 7 : నగరంలోని బాల సదన్, శిశుగృహను సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కే వెంకటేశ్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బాలసదన్‌లోని వంటగదిని పరిశీలించారు. అక్కడక్కడ చేపట్టాల్సిన మరమ్మతులకు సంబంధించి సూచనలు చేశారు. ఆహార పదార్థాలు నిలువచేసే గది తనిఖీ చేసి, ఆహార పదార్థాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అలాగే బాలసదన్‌లో కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం శిశుగృహను సందర్శించి ఆశ్రయం పొందుతున్న చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం, తీసుకుంటున్న జాగ్రత్తలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎలాంటి న్యాయపరమైన సేవ అవసరమైనా తమను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యుడు తణుకు మహేశ్, బాల సదన్, శిశు గృహ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

## జైల్‌లో అదాలత్


ఖైదీని విచారిస్తున్న మెజిస్ట్రేట్

రాంనగర్, అక్టోబర్ 7: కరీంనగర్ జిల్లా జైలులో పెద్దపల్లి చీఫ్ జూడీషియల్ మెజిస్ట్రేట్ అర్జున్ జైల్ అదాలత్ నిర్వహించారు. ఇందులో కరీంనగర్‌కు సంబంధించి 10 మంది ఖైదీల 18 కేసులను అక్కడికక్కడే పరిష్కరించి శిక్ష, జరిమానా విధించారు. క్షణికావేశంలో చేసిన తప్పులను సరి దిద్దుకునేందుకు శిక్షా కాలం సరైందని, భవిష్యత్‌లో సమాజంలో మంచి పౌరులుగా గుర్తింపు పొందేందుకు అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ సమ్మయ్య, జైలర్లు రమేశ్, శ్రీనివాస్, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యుడు చందు శ్రీనివాస్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## మొగ్దుంపూర్ అంబేద్కర్ సంఘ భవనానికి భూమిపూజ

కరీంనగర్ రూరల్, అక్టోబర్ 7: కరీంనగర్ మండలం మొగ్దుంపూర్ గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సంఘం నూతన భవనానికి సర్పంచ్ జక్కం నర్సయ్య శనివారం భూమిపూజ చేశారు. అంబేద్కర్ భవన నిర్మాణానికి రూ.10 లక్షల నిధులు మంజూరు చేసినందుకు మంత్రి గంగుల కమలాకర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దామరపల్లి పుష్పలత, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు వడ్లూరి అశోక్, ఉపసర్పంచ్ కుక్కల తిరుపతి యాదవ్, వార్డు సభ్యులు పాలకొండ రజిత, మీసాల మహేశ్వరి, పోతర్ల క్రాంతికుమార్, మీసాల ప్రశాంత్, మీసాల ఆంజనేయులు, వడ్లూరి ఉపేందర్, మీసాల తిరుపతి, వడ్లూరి సంజయ్, యూత్ ఆర్గనైజర్స్ పరమేశ్వర్, పోతర్ల మునీందర్, మీసాల గంగారాం, మీసాల శంకర్, మీసాల సాయిలు, వడ్లూరి కొమురయ్య, వడ్లూరి తిరుపతి, మీసాల వెంకటరణ, మీసాల వేణు, మీసాల లక్ష్మణ్, వడ్లూరి లక్ష్మణ్, తాండ్ర కొండయ్య, తాండ్ర రాజేశ్వరి, తాండ్ర పరశురాం, లింగంపల్లి గిరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కొలిమికుంటలో బతుకమ్మ చీరల పంపిణీ


బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న సర్పంచ్

చొప్పదండి, అక్టోబర్ 7: మండలంలోని కొలిమికుంట గ్రామంలో శనివారం సర్పంచ్ తాల్లపల్లి సుజాత- శ్రీనివాస్ గౌడ్, ఎంపీటీసీ తోట కోటేశ్, ఉప సర్పంచ్ సత్తు తిరుపతి మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, మహిళల కోసం అనేక గొప్ప పథకాలు తీసుకువచ్చిన ఏకైక సీఎం కేసీఆర్ అని కొనియాడారు. ముఖ్యంగా మహిళలు తీసుకున్న రుణాలను వడ్డీ మాఫీ చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ ప్రవళిక, వార్డు సభ్యులు ఆకుల సురేశ్, సత్తు తిరుపతి, సత్తు పరశురాములు, కో ఆప్షన్ సభ్యుడు తాల్లపల్లి గంగ, బీఆర్‌ఎస్ గ్రామాధ్యక్షుడు మల్యాల మహేందర్, మాజీ సర్పంచులు నెరుమట్ల మల్లేశం, చొక్కల్ల కనకయ్య, నాయకులు నెల్లి లక్ష్మయ్య, మహిళలు పాల్గొన్నారు.

### చిగురుమామిడి మండలంలో..

చిగురుమామిడి, అక్టోబర్ 7: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. కాగా, బతుకమ్మ పండుగకు సీఎం కేసీఆర్ పెద్దన్నగా చీరలు కానుకగా అందజేస్తున్నారని మహిళలు ఆనందం వ్యక్తం చేశారు

## నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వేకు సహకరించాలి

చొప్పదండి, అక్టోబర్ 7: మండలంలోని కొలిమికుంట గ్రామంలో చేపడుతున్న నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే కార్యక్రమాన్ని తాల్లపల్లి సుజాత- శ్రీనివాస్ గౌడ్ శనివారం ప్రారంభించారు. రెండు రోజుల పాటు కొనసాగే ఈ సర్వేలో భాగంగా ఇంటికి వచ్చిన అధికారులకు ప్రజలు కుటుంబ వివరాలు చెప్పి సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఐటీ రాజేందర్‌రెడ్డి, లిస్టర్ ఉదయ్ కిరణ్, మ్యాపర్ మారుతి, సెక్రటరీ ప్రవళిక, వార్డు సభ్యులు, కో ఆప్షన్ సభ్యుడు, నాయకులు పాల్గొన్నారు.